www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 19 అక్టోబరు 2025

5

చిత్తూరు

భారీ వర్షం..వరద ఉధృతి

- కొట్టుకుపోయిన జీడి రేవుల వంక తాత్కాలిక మట్టి కల్వర్టు
- ఆరు పంచాయతీలకు ఆగిన రాకపోకలు
- బస్సు సర్వీసుకు అంతరాయం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలో శనివారం సాయంత్రం రెండున్నర గంట సేపు కురిసిన భారీ వర్షం కారణంగా సోమల నుండి నంజంపేట మార్గమధ్యంలోని జీడి రేవుల వంకపై నిర్మించిన తాత్కాలిక మట్టి కల్వర్టు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. మట్టి కల్వర్టు కొట్టుకుపోవడంతో నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లి, ఆవులపల్లి, పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మ గారి పల్లి, పేటూరు పంచాయతీలకు సోమల నుండి రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం నుండి విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో ఈ పంచాయతీలలో ప్రజలు చిమ్మ చీకట్లు నెలకొన్నాయని స్థానికులు తెలిపారు. పలమనేరు నుండి ఎర్రగుంతలపల్లి, అన్నెమ్మ గారి పల్లి మీదుగా పెద్ద ఉప్పరపల్లికి వచ్చే ఆర్‌టిసి బస్సు సైతం ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి చెరువులు మొరవలు పోతుండడంతో బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆరు పంచాయతీలకు ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండాపోయింది.

తెగిపోయిన జీడి రేవుల వంక తాత్కాలిక మట్టి కల్వర్టు

వాతావరణ హెచ్చరికలు తెలిపేవారు లేక ప్రమాద ఘంటికల వద్ద ముందస్తు బందోబస్తు చర్యలు చేయకపోవడం కారణంగా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోయిందని ఈ ప్రాంత ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

రెడ్డివారి పల్లి, బసవ పల్లి మార్గం, దడవాయి చెరువు తూము, జీడిరేవుల వంక, గువ్వల గుట్ట తదితర ప్రాంతాలలో తాత్కాలిక మట్టి కల్వర్టుల స్థానంలో శాశ్వత బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా పాలకులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం, వర్షాలు కురవడం తాత్కాలిక మట్టి వంతెనలు కొట్టుకుపోవడం , మళ్లీ వరద ఉధృతి తగ్గగానే మట్టితో కూడిన వంతెనలు నిర్మిస్తున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను గుర్తించి అవసరమైన చోట వంతెనల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

ఇళ్లలోకి వర్షపు నీరు- గ్రామస్తుల ఇబ్బందులు

సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసు పల్లె రామాలయం సమీపంలోని దాదాపు 15 ఇళ్లలోకి శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లపై నదిని తలపిస్తూ వర్షపు నీరు ప్రవహిస్తూ ఇళ్లలోకి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ వీధిలో మురుగునీటి కాలువలు నిర్మించని కారణంగా మురుగునీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయిందని సిమెంటు రోడ్డుకు సమానంగా ఇళ్లు ఉన్న కారణంగా వర్షపు నీరు నేరుగా ఇళ్లలోకి వచ్చి చేరడంతో ఏమి చేయాలో దిక్కు చేసుకుని పరిస్థితిలో ఉన్నామని వాపోతున్నారు. మురుగునీటి కాలువలు నిర్మించి మురుగు నీటితో పాటు వర్షపు నీరు కూడా కాలువలలో సజావుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

జలపాతంలో గల్లంతైన మృతదేహం లభ్యం

- మునిగిన చోటు నుండి నాలుగు కిలోమీటర్లు కొట్టుకుపోయిన మృతదేహం
- మృతుడు యూనిస్ కుటుంబంలో విషాదం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం కల్యాణరేవు జలపాతంలో సరదాగా ఈతకెళ్లి గల్లంతైన యూనిస్ (23) మృతదేహాన్ని అగ్నిమాపక అధికారులు శనివారం వెలికితీశారు. దీంతో మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పలమనేరు పట్టణం పోలీస్ లైన్ వీధికి చెందిన యూనిస్ గత రెండు రోజుల ముందు తన స్నేహితులతో కలిసి కల్యాణరేవు జలపాతంలో రీల్స్ తీసేందుకు వెళ్లి సరదాగా ఈత కొట్టడానికి దూకి గల్లంతైన విషయం విదితమే. రెండు రోజులుగా యూనిస్ కోసం అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి వెతకగా, శనివారం మధ్యాహ్నం యూనిస్ మునిగిన చోటు నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లి మృత దేహమై తేలాడు. దీంతో అతని కుటుంబీకులు, స్నేహితులు రోదనలు మిన్నం టాయి. యూనిస్ మృతదేహాన్ని పలమనేరు పట్టణానికి తీసుకు రావడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

పలమనేరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ వద్ద యూనిస్ మృతదేహాన్ని చూడడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రీల్స్ కోసం ప్రాణాలు పణంగా పెట్టొద్దు

యునుస్ కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

పలమనేరు: రీల్స్ కోసం యువత తమ ప్రాణాలను పణంగా పెట్టొద్దని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సూచించారు. కళ్యాణ రేవులో గల్లంతయిన యువకుడు యునుస్ కుటుంబీకులను స్థానిక టిడిపి నేతలతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. మూడు రోజులుగా యునుస్ ఆచూకీ లభించకపోవడం పై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా దుర దృష్టకరమైన, ఎంతో బాధాకరమైన సంఘటనని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తాము అండగా ఉన్నామని భరోసా కల్పించారు. గల్లంతైన యువకుని గాలింపు చర్యలపై పోలీస్, ఫైర్ అధికా రులతో ఆయన ఫోన్లో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు, యువత ప్రమాదకర ప్రాంతాల్లో ప్రాణాలకు తెగించే సాహసాలు చేయొద్దన్నారు. సెల్ఫీలు, స్టంట్స్ కోసం ప్రాణాల మీదకి తెచ్చుకొని కన్నవారికి కడుపుకోత మిగిల్చవద్దని యువతకు హితవు పలికారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్వీ బాలాజీ, సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, నాగరాజు, ఖాజా పీర్, బిఆర్‌సి కుమార్, శ్రీధర్,సుధాకర్, చిన్నీ, జిలాని, సాధిక్, నదీం పాల్గొన్నారు.

యూనిస్ మృతదేహాన్ని తీసుకొస్తున్న అగ్ని మాపక అధికారులు, సిబ్బంది

ఎన్‌టిఆర్ జలాశయానికి జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

ఎన్‌టిఆర్ జలాశయం నుండి నీరు విడుదల

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగర శివారులో కల్వకుంట వద్దనున్న ఎన్టీఆర్ జలాశయంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ శనివారం జలహారతి ఇచ్చి నీటిని విడుదల చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎన్టీఆర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండింది. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే జలాశయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గంగమ్మకు పసుపు, కుంకుమ, వస్త్రం, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా గేట్లు ఎత్తి నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, డీఈలు శ్రావణి, రమణ, నగర అధ్యక్షుడు నరేష్, తెలుగు మహిళా నగర అధ్యక్షులు నళిని, నాయకులు వెంకటేష్ యాదవ్, వరలక్ష్మి, రాణి, మోహన్ రాజ్, సబిత, ప్రతిభ, నీరజాక్షులు నాయుడు, ఉదయ్, నవీన్ పాల్గొన్నారు.

భోజనం నాణ్యత పరిశీలన

భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఈవో పెంచలకిషోర్

ప్రజాశక్తి -ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి పెంచల కిషోర్ ఆలయ నిత్యాన్నప్రసాద భవనంలో శనివారం భక్తులతో, దేవస్థాన అధికారులతో కలిసి భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. భక్తులను అడిగి భోజనం రుచిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఎస్‌వి కృష్ణారెడ్డి, ధనంజయ, రవీంద్రబాబు, పాల్గొన్నారు.

వేటగాడు అరెస్ట్

- అటవీ జంతువుల మాంసం, ద్విచక్ర వాహనం స్వాధీనం

వేటగాడిని అరెస్టు చేసిన ఫారెస్టు అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: అటవీ ప్రాణుల్ని వేటాడి మాంసం విక్రయిస్తున్న ఓ వేట గాడిని ఫారెస్టు అధికారులు కార్వేటి నగరం సమీపంలో శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. చిత్తూరు డిఎఫ్‌ఓకు అందిన రహస్య సమాచారం మేరకు వెదురుకుప్పం మండలం షికారి కాలనీకి చెందిన మోహన్ కుమారుడు శ్రీరాముడు కార్వేటినగరం మండలం దాసరి నత్త గ్రామ సమీపంలో నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడి కాల్చి చంపి మాంసాన్ని విక్రయిస్తుండగా కార్వేటినగరం ఫారెస్టు శాఖ అధికారులు అతడిని, నాటు తుపాకులతో పాటూ మాంసాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని శనివారం రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎఫ్‌ఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, డిఆర్‌ఓ ఆనంద్ రెడ్డి , ఎఫ్‌ఎస్‌ఓ లోకేష్ భేటీ అధికారులు దొరస్వామి వినోద్ కుమార్ సతీష్ బాబు పద్మనాభం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- తమిళనాడులో 30కి పైగా కేసులు
- కారుతో పాటు 125 గ్రాముల బంగారు స్వాధీనం

ప్రజాశక్తి-కుప్పం: కారులో వచ్చి రెక్కి నిర్వహించి దొంగతనాలకు పాల్పడే అంతర్ రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు కుప్పం డిఎస్‌పి పార్థసారథి, రూరల్ సీఐ మలేష్ యాదవ్ తెలిపారు. కుప్పం డిఎస్‌పి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమిళనాడు ఆంబూరు సమీపంలోని ఉదయందిరానికి చెందిన గోడ్విన్ మోహన్ రాజేంద్రన్ (32) రామకుప్పం మండలం చల్దిగానిపల్లి, వి కోటలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇతనిపై రామకుప్పం, వి కోట పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసులు నమోదు కాగా రామకుప్పం మండలం విజలాపురం సమీపంలోని సంతమిట్ట క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. గోడ్విన్ మోహన్ రాజేంద్రన్ వద్ద కారుతోపాటు 125 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇతనిపై తమిళనాడు లో 30కు పైగా దొంగతనం కేసులు ఉన్నాయని అంతర్ రాష్ట్ర దొంగను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ బృందాన్ని డీఎస్పీ పార్థసారథి అభినందించారు.

పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డులు

తమిళనాడులో 30కు పైగా చోరీలకు పాల్పడ్డ అంతర్ రాష్ట్ర దొంగను పట్టుకున్న పోలీస్ సిబ్బందికి డీఎస్పీ పార్థసారథి క్యాష్ రివార్డులు అందించారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం గుడిపల్లి రాళ్ల బూదుగురు ఎస్సైలు వెంకట మోహన్ శ్రీనివాసులు నరేష్ తో పాటు పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ క్యాష్ రివార్డులు అందించారు.

మంత్రివర్గ కమిటీలతో కాలయాపన తగదు ..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం మంత్రివర్గ కమిటీలతో కాలయాపన చేయడం తగదని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ రెడ్డి శేఖర్ రెడ్డి ఆక్షేపించారు. మంత్రివర్గ ఉప సంఘంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. ప్రభుత్వానికే కాదు ఆర్థిక ఇబ్బందులు ఉద్యోగులు కూడా ఉండాయని, పండుగలవేళ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం లేదని ఆవేదన చెందారు . ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల ముఖ్యమంత్రికి సానుకూల వైఖరి ఉంటే తక్షణమే12వ పిఆర్సి చైర్మన్ నియమించి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తనకున్న విచక్షణాధికారాలతో తక్షణమే రెండు డి ఏ లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సరండర్ లీవుల బకాయిలు, సి.పి.ఎస్ వారికి90 శాతం డి ఏ పెండింగ్ ను వెంటనే చెల్లించాలి అన్నారు. ఉపాధ్యాయులకు బోధన తప్ప, బోధ నేతల కార్యక్రమాలు లేకుండా చేయాలని కోరారు. హై స్కూల్ ప్లస్ లలో వెంటనే ఉపాధ్యాయులు నియమించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్సుమెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసే తేదీ నాటికే ఉద్యోగ ఉపాధ్యాయులకు కమ్యూటేషన్,గ్రాట్యూటీ, పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టెట్ మినహాయింపుకై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు.

జిల్లా హాకీ పోటీలకు భవిష్ రాజ్



ప్రజాశక్తి -వి కోట : మండల కేంద్రమైన వి కోటకు చెందిన భవిష్ రాజ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) హాకీ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. చంద్రగిరిలో ఈనెల 17వ తేదీ నిర్వహించిన హాకీ పోటీలలో వికోట నారాయణ పాఠశాలకు చెందిన భవిష్యరాజ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు వారికి నచ్చిన ఇతర అంశాలపై కూడా ప్రతిభ కనపరచడం అభినంద నీయమని పుర ప్రముఖులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఈ పోటీలతో విద్యార్థుల సర్వతో ముఖా భివృద్ధికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి భవిష్ రాజ్ కు నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం పని కుమార్, మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ గీత శుభాకాంక్షలు తెలిపారు.

దీపావళికి స్పెషల్ ట్రైన్స్

ప్రజాశక్తి-కుప్పం: దీపావళి పండుగ సందర్భంగా ఆరు రోజులు పాటు కుప్పం మీదుగా రైల్వే శాఖ స్పెషల్ ట్రైన్స్ నడపనుంది. రాత్రి 7.55 గంటల బెంగళూరు సిటీ నుండి 9.55 గంటలకు కుప్పం చేరుకుని జోలార్ పేట్ వెళుతుంది. తిరిగి అర్థరాత్రి 11:50 గంటలకు కుప్పం నుండి బెంగళూరు వెళ్లనుంది. ఉదయం 9.40 గంటలకు బెంగళూరు సిటీ నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 12.15 గంటలకు కుప్పం నుండి బయలుదేరి 3 గంటలకు బెంగళూరు సిటీ చేరుకుంటుంది.

ముగుస్తున్న సీజన్

- అందని సబ్సిడీ ఉలవలు
- మెట్టభూముల రైతుల నిరీక్షణ

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వర్షాధార వేరుశనగ ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. పూర్తిగా వర్షాధార పంట వేరుశనగ వేసిన రైతులు నష్టపోయారు. ఉమ్మడి జిల్లాలో వేరు శనగ సాగు ఈ ఏడాది 2,30,709 ఎకరాల్లో సాగు చేశారు. సకాలంలో వర్షాలకు కురవకపోవడంతో వేరుశనగ పంట అంతతమాత్రంగానే వచ్చింది. ఈ పంట నమోదు 1,93,297 మంది రైతులు నమోదు చేసుకున్నారు. 84,412 క్వింటాళ్ల విత్తనాలను 1,59,514 మంది రైతులకు 32.67 కోట్ల రాయితీతో ప్రభుత్వం సరఫరా చేసినా విత్తన కాయల కొనుగోలు డబ్బులు కూడా రాలేదని ఖరీఫ్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులు పంటనష్టం బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఇదిలా ఉంటే ఖరీఫ్ వేరుశనగ నష్టాన్ని మిగల్చడంతో ఉలవసాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు ప్రభుత్వం నుండి సబ్సిడీ ఉలవల సరఫరా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వర్షాధార మెట్ట భూములు ఉన్న రైతులకు ఉలవలు వేసుకోవడానికి సమయం దాటుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీతో ఇచ్చే ఉలవలను వీలైనంత త్వరగా రైతులకు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

పంట పెట్టుబడులు కూడా భారీగా పెరిగాయి. అందులో సకాలంలో వర్షాలు పడక పోవడం ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పూర్తిగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు. వర్షాధార వేరుశనగ విస్తీర్ణం గత ఏడాదితో పొల్చితో తగ్గింది. గత ఏడాది 3 లక్షల హెక్టార్లపై పైగా సాగు చేయగా ఈ ఏడాది రెండున్న లక్షల హెక్టర్లలోపే సాగు విస్తీర్ణం వుంది.

మెట్ట భూముల్లో ఉలవలు వేసుకోవడానికి సిద్ధం చేసుకున్న వ్యవసాయ భూములు, బీడు భూములే కాకుండా మామిడి తోటల్లోనూ అంతర్ పంటగా ఉలవలు వేయ డం వల్ల రైతులకు కొంత లాభసాటిగా ఉం టుందని రైతులు భావి స్తు న్నారు. ఈ సీజన్లో ఉలవలు వేసు కోవడా నికి సీజన్ దాటు తోంద ని ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే ఉలవల కోసం ఎదురు చూస్తు న్నారు. మామిడి సీజన్ మామిడి రైతులను నిలువునా ముంచింది. ప్రభుత్వం సబ్సిడీ టన్నుకు రూ. 4 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నా..ఫ్యాక్టరీ టన్నుకు రూ. 8వేలు ఇవ్వాలన్న ప్రభుత్వం ప్రకటనను విస్మరించి నష్టాలు, కష్టాల సాకుతో తప్పించుకొనే ప్రయత్నం చేయడంతో జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదే క్రమంలో ప్రకృతి వైపరీత్యాలతో ఖరీఫ్ రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ముందే ప్రభుత్వం రైతులకు ఉలవలు సరఫరా చేస్తే కొంత వరకు ఉపశమనం కలిగేది. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీ ఉలవలు సరఫరా చేసి రైతులకు కొంత ఉపశమనం కలిగించాలని రైతులు కోరుతున్నారు.

ఉలవల కోసం దుక్కిదున్ని సిద్ధం చేసుకున్న భూముల్లో గడ్డి మొలసిన దృశ్యం (ఐరాల మండలం)

పర్యాటక కేంద్రంగా కైగల్ జలపాతం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని కైగల్ దుముకురాళ్ల జలపాతం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమరనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన బైరెడ్డిపల్లి మండలంలోని కైగల్ జలాశయాన్ని, దుముకురాళ్ల జలపాతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు మండల తహశీల్దార్ ప్రసన్నకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దాము, సర్వేయర్ నరేష్, టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. జలాశయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని పరిశీలించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి జలపాతం పరిసర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ కైగల్ దుముకురాళ్ల జలపాతం ప్రకృతి అందాలకు ప్రతీక అని, ఈ ప్రాంతాన్ని రాష్ట్ర స్థాయి టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దే చర్యలు ప్రారంభిం చామన్నారు. ప్రైవేట్ సంస్థలు, పిపిపి విధానంలో అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి ప్రణాళికల్లో భాగంగా జాతీయ రహదారి నుండి జలపాతం వరకు సీసీ రోడ్డును నిర్మించడం, పర్యాటకుల కోసం విశ్రాంతి గృహాలు, వాష్‌రూమ్‌లు, భద్రతా కంచెలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. జలపాతం పరిసర ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కైగల్ జలపాతం, దుముకురాళ్ల జలాశయ ప్రాంతాలు అభివృద్ధి చెందిన పర్యాటక కేంద్రాలుగా మారితే చిత్తూరు జిల్లాకు గుర్తింపు పెరుగుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కైగల్ జలపాతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలి: సీఐ

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): రాబోయే దీపావళి పండు గను సురక్షి తంగా జరుపు కునేందుకు ముఖ్య నిబంధనలు తప్ప నిసరిగా పాటించాలనీ సీఐ ప్రసాద్ సూచిం చారు. టపాసులు కాల్చేటప్పుడు చిన్నపిల్లలకు పెద్దవాళ్లు పక్కన ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అని గడ్డివాములు, పశువుల పాకలు, పెట్రోల్ బంక్‌ల దగ్గర టపాసులు కాల్చవద్దని, టపాసులు కాల్చేటప్పుడు నూలు దుస్తులు మాత్రమే ధరించాలన్నారు. బాణసంచా అక్రమ విక్రయాలు లేదా నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిస్తే, వెంటనే డయల్ 100 లేదా 112 నెంబర్లకు కాల్ చేసి తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలు పాటిస్తే పండుగను సురక్షితంగా జరుపుకోవచ్చున్నారు.

అతివేగం తెచ్చిన అనర్థం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -సోమల: ద్విచక్రవాహనంలో వెళుతున్న ఓ యువకుడి అతివేగం ప్రాణాలను బలితీసుకున్న సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శివశంకర్ కథనం మేరకు.. సోమల పంచా యతీ చెన్నయ్య గారి పల్లె గ్రామానికి చెందిన రాజమ్మ మల్లికార్జున దంపతుల కుమారుడు గంగాధర్ (25) తన ద్విచక్ర వాహనంలో సొంత పనుల నిమిత్తం చౌడేపల్లికు వెళుతూ ఉండగా ఇరికిపెంట లక్ష్మీపురం మలుపునకు కొద్ది దూరంలో ఎదురుగా వస్తున్న కారును అతి వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ కారుకు ఎడమవైపు ఢీకొట్టడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. తల, ముక్కు, చేయి, కడుపు భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందా డు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 108 వాహనం వచ్చేలోపే గంగాధర్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నెల పాటు జిఎస్‌టి 2.0పై అవగాహన

నేడు ముగింపు సంబరాలు: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి 2.0 ద్వారా తీసుకువచ్చిన సంస్కరణలో భాగంగా వినియోగదారులకు కలిగే ప్రయోజనాలపై నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించిన సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ముగింపు సభ ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిఎస్‌టి2.0 ల ద్వారా ధరలు చాలా తగ్గి వినియోగదారునికి ఊరట కలుతుందన్నారు. ధరల తగ్గింపు వివరాలపై ప్రజలకు అవగాహన కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో సూపర్ జిఎస్‌టి – సూపర్ సేవింగ్స్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ముగింపు సందర్భంగా చిత్తూరులోని పివికెఎన్ కళాశాల సమీపంలోని జ్యోతి రావు పులే భవనంలో స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో వివిధ వాణిజ్య స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్, చిత్తూరు ఆర్డిఓ లు కార్యక్రమలను పర్యవేక్షించాలన్నారు. డిఆర్డిఏ డిపిఎం, చిత్తూరు తహశీల్దార్, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్లు స్టాల్స్ ఏర్పాటు, జిల్లా ఉద్యాన అధికారి ఫ్రూట్ స్టాల్ ఏర్పాటును పర్యవేక్షించాలని ఆదేశించారు. డియాస్ ఏర్పాటు చిత్తూరు అర్బన్ తహశీల్దారు పారిశుధ్య నిర్వహణ చిత్తూరు మున్సిపల్ కమిషనర్, నిరంతరాయ విద్యుత్, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని ఏపిఎస్ పిడిసిఎల్ ఎస్ఈ ని, సాంస్కృతిక కార్యక్రమ ఏర్పాటు జిల్లా టూరిజం అధికారి చూసుకోవాలన్నారు. డిఆర్డిఏ, మెప్మా పిడి లు కార్యక్రమ నిర్వహణ పై ప్రజల్లో విస్తత అవగాహన కలిగించి అధిక సంఖ్య లో ప్రజలు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో విజయకుమారి

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి: ఎంఈఓ

ప్రజాశక్తి -సోమల: తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు మరింత మెరుగైన బోధన అందించాలని ఎంఈవో విజయ కుమారి పేర్కొన్నారు. ఇరికిపెంట పంచాయతీ ఎర్ర నాగుల వారి పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం సమావేశం నిర్వహించి ఉపాధ్యాయులకు సమయపాలన పాటించాలని, మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని పలు సూచనలు అందించారు.

వైసిపి నుండి టిడిపిలో చేరుతున్న కుటుంబాలు

టిడిపిలో 35 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండలం టి సదుమూరు పంచాయతీ సింగారపురానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి శనివారం టిడిపిలో చేరాయి. సీఎం చంద్రబాబు తోనే కుప్పం ప్రాంత అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలని వైసీపీని వీడి టిడిపిలో చేరుతున్నట్లు వారు తెలిపారు. టిడిపిలో చేరిన వారికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, పార్టీ కండువాతో స్వాగతం పలికారు. రాజకీయాలకతీతంగా కుప్పం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రామచంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షులు చంద్ర, ఆర్ముగం, ప్రకాష్, మోహన్, విభూషణ్, సంపత్, యువరాజ్, మహేంద్ర, శేఖర్, మునస్వామి పాల్గొన్నారు.

విజయం విద్యా సంస్థల్లో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగరంలోని నాయుడు బిల్డింగ్స్ వద్ద వున్న విజయం డిగ్రీ కళాశాల, సుందర్ రాజపురం సీబీఎస్ఈ విద్యా సంస్థల్లో శనివారం దీపావళి సంబరాలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజ విద్యార్థినీ విద్యార్థులకు దీపావళి ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

దీపావళికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి: అర్బన్ సీఐ

ప్రజాశక్తి-పలమనేరు : దీపావళికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని పలమనేరు అర్బన్ సీఐ మురళీమోహన్ శనివారం పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకునేందుకు ముఖ్య నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. టపాకాయలు కాల్చేటప్పుడు చిన్నపిల్లలకు పెద్దవాళ్లు పక్కన ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గడ్డివాములు, పశువుల పాకలు, పెట్రోల్ బంక్‌ల దగ్గర టపాకాయలు కాల్చవద్దు. టపాకాయలు కాల్చేటప్పుడు కాటన్ డ్రెస్సులు (నూలు దుస్తులు) మాత్రమే ధరించాలి. బాణసంచా అక్రమ విక్రయాలు లేదా నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిస్తే, వెంటనే డయల్ 100 లేదా 112 నెంబర్లకు కాల్ చేసి తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు.

లక్ష్మీనరసింహ కళాశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి -కార్వేటినగరం : స్థానిక ఎస్ఎల్ఎన్ విద్యా సంస్థలలో ముందస్తు దీపావళి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎ దిలీప్ కుమార్ మాట్లాడుతూ దీపావళి హిందూ సంప్రదాయంలో అత్యంత వైభవంగా నిర్వహించే పండుగల్లో ఒకటని, ఈ పండుగను ఆశ్వయుజ మాసం అమావాస్య రోజు ఎంతో ఆనందంతో జరుపుకుంటారని, నేడు అంధకారంపై వెలుగుజయం అని భావించి, ఇంటి చుట్టూ వరుసగా దీపాలను వెలిగించి, చీకటిని తొలగిస్తూ, వెలుగుతో నిండిన ప్రపంచాన్ని సృష్టిస్తారన్నారు. అందుకే దీన్ని వెలుగుల పండుగ అని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జీ ధనంజయ రెడ్డి, ఎస్ వెంకటేష్ , ఏ పురుషోత్తం, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, హైస్కూల్ హెచ్ఎం లతా, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు టపాకాయలు పేల్చి ఆనందాన్ని తెలిపారు.

ప్రభుత్వ వాహనాలకు ఆయుధపూజ చేస్తున్న దృశ్యం

ఘనంగా ఆయుధ పూజ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో దసరా ఆయుధ పూజను అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా నిర్వహించారు. సోమల సచివాలయంలో, తహశీల్దారు కార్యాలయంలో, ఇరికిపెంట సబ్ సెంటర్‌లో సబ్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. దేవుడి చిత్ర పటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యాలయంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలమనేరు మార్కెట్ కమిటీ కార్యవర్గం

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని టిడిపి కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించింది. పలమనేరు మార్కెట్ కమిటీలు తమకు చోటు కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు సమావేశమై ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల కుప్పం రాజన్న, డైరెక్టర్లు రుద్రమూర్తి నాయుడు, కుమార్ రఘు, సోమశేఖర్, రెడ్డెప్ప, నదీమ్, శంకరప్ప లతో పాటు నాయకులు రామచంద్ర నాయుడు, రాంబాబు, చంద్రశేఖర్, హరి,బాలాజీ పా ల్గొన్నారు.

సీడ్ బాల్స్ పంపిణీ

ప్రజాశక్తి-కుప్పం:కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో చల్ల ఎందుకు సీడ్ బాల్స్ ను పంపిణీ చేశారు. ప్రస్తుతం కుప్పం ప్రాంతంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కుప్పం ఫారెస్ట్ పరిధిలో సీడ్ బాల్స్ చల్లుతారని ఎఫ్ఆర్ఓ జయశంకర్ తెలిపారు. కుప్పం అటవీ ప్రాంతంలో పచ్చదనం పెంపొందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి శాంతిపురం: మండల పరిధిలోని వెంకటేష్ పురం గ్రామానికి చెందిన బాలకృష్ణ కుమార్తె భువనేశ్వరి అదృశ్యంపై రాళ్లబూదుగురు పోలీసులకు శనివారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల కథనం మేరకు..బాలకృష్ణ కుమార్తె భువనేశ్వరి డిప్లొమా పూర్తి చేసి కంప్యూటర్ కోర్సు కోసం పలమనేరులో ఉంటోందని ఐదు రోజుల క్రితం పండుగ కోసం స్వగ్రామంలోని ఇంటికి వచ్చిన భువనేశ్వరి శుక్రవారం మధ్యాహ్నం నుండి కనిపించడం లేదని తెలిపారు. అమ్మాయి ఆచూకీ తెలిసిన వారూ రాళ్ళబుదుగురు పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు.

మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ

ఏజెంట్లను నియమించుకోవాలి

రాజకీయ పార్టీలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూచన

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ప్రతి పోలింగ్ బూత్‌కు వేర్వేరు రాజకీయ పార్టీ నుంచి ఏజెంట్లను నియమించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ పిలుపు నిచ్చారు. తహశీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఏజెంట్‌లను నియమించుకునే వారి వివరాలను అధికారులకు అందించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఏదైనా సమస్యలు ఉంటే తెలపాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌కెవిబీ పేట పోలింగ్ కేంద్రంలో ఆదిఆంధ్ర (మాదిగ) కులానికి చెందిన ఓటర్లు ఎవరూలేరని, ఇక్కడ అది ద్రావిడ కులానికి చెందిన వారు మాత్రమే ఓటర్లు ఉన్నారని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారులు శ్రీనివాసులు, లోకనాథం పిళ్లై, ఎన్నికల డీటీ మహేశ్వరి, వివిధ పార్టీల నేతలు సుధాకర్, గోవర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేష్ రెడ్డి, లోకేష్, శివ కుమార్ , ఉదయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మండల పరిధిలోని పరమసముద్రం శ్రీ కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థినులు స్థానికంగా ఉన్న ఆహార పరిశ్రమను శనివారం సందర్శించారు. ఆహార పరిశ్రమలు పాలు నిల్వ చేసే పద్ధతుల గురించి విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ సాయికుమారి అవగాహన కల్పించారు. శాంతిపురంలోని హెరిటేజ్ పాల డెయిరీని సందర్శించి పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తుల గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సాయి కుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాల డెయిరీని సందర్శించిన విద్యార్థినులు

పేదల ఆరోగ్యానికి పెద్ద పీట..!: టిడిపి

ప్రజాశక్తి- రామకుప్పం: పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే గ్రామాల్లో రక్త పరీక్షల కార్యక్రమం ప్రభుత్వం చేపడుతున్నట్లు టిడిపి రామకుప్పం మండల కన్వీనర్ వెంకటరమణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం ప్రజల ఆరోగ్యం బాగుండాలని మంచి మనసుతో అందరికీ సంజీవని ప్రోగ్రాం చేపడుతున్న ట్లు తెలిపారు. మానేంద్రం పంచాయతీ, కృష్ణారాజపురం గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది రక్త పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రక్త పరీక్షలు తో 42 రకాల టెస్టులను చేపట్టి ముందస్తు ఆరోగ్య చికిత్స లు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ అధ్యక్షులు మంజునాథ రెడ్డి, బూత్ కన్వీనర్ మోహన్, భానుమూర్తి,చంద్రశేఖర్ రెడ్డి,మంజునాథ్, నాయకులు, పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం మత్తుకు రూ.లక్షా ఏభై వేల జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం లక్ష50వేల రూపాయలు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె లక్ష్మీనారాయణ నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. ఈనెల 14 వ తేదీ ఏడుగురిని ఈనెల 18 వ తేదీ ఎనిమిది మందిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి కుమారి ఉమాదేవి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 15 మందికి లక్ష యాభైవేల రూపాయలు జరిమానా విధించారు.

మృతి చెందిన వడ్డే వెంకటరామప్ప

గాయపడిన సత్యప్ప

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -శాంతిపురం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు శాంతిపురం మండలం కెనమాకుల పల్లె గ్రామానికి చెందిన వడ్డే వెంకటరామప్ప(56), సత్యప్ప (57) బడుగుమాకుల పల్లె వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కొలిమి ఆచారి అంగడిలో మచ్చు కత్తి కొనుగోలు చేసి తిరుగు ప్రయాణంలో రోడ్డుపైకి వచ్చారు. మండల కేంద్రానికి సమీపంలోని బడుగుమాకులపల్లి సంతను సమీపిస్తుండగా రాజుపేట రోడ్డు వైపు నుండి వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వెంకట రామప్ప సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సత్యప్పకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన సత్యప్పను 108 ద్వారా కుప్పం పిఇఎస్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాళ్ళబుదుగురు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి మృతిచెందిన హరిబాబు

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాల్టీ డీకే పల్లి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మోడల్ కాలనీకి చెందిన హరిబాబు శనివారం చెరువులో మృతదేహమై తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. హరిబాబు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి వుంది.

22న వృక్షాల నరికి వేతకు వేలం

ప్రజాశక్తి - రామకుప్పం : మండల కేంద్రమైన రామకుప్పంకు సమీపంలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లోని 67 వృక్షాల నరికి వేతకు వేలం పాట నిర్వహించ నున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజనీకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.ఆసక్తి ఉన్నవారు ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు పాఠశాల వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి

జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు అరుణ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం వచ్చాకే వాడవాడల అభివృద్ధి చెందిందని జిల్లా టిడిపి మహిళా అధ్యక్షురాలు అరుణ అన్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో కూటమి నేతలు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌పై తప్పుడు ఆరోపణలు చేసిన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కృపాలక్ష్మి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, నియోజవర్గంలోని టిడిపి మహిళలు, కూటమి నాయకులు ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, పెనుమూరు మండల పార్టీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయ్ యాదవ్, మాజీ ఎంపీపీ రెడ్డప్ప, నాయకులు నియాజ్ అలీ, జీవరత్నం, సింగల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, గోపి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : మొక్కల పెంపకం ద్వారా స్వచ్ఛమైన గాలి అందుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, పెంచడం అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. అక్టోబర్ మూడవ శనివారం 'స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్ర మంలో భాగంగా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యవంతమైన జీవనం' అంశంపై శనివారం ర్యాలీ, అవగాహన నిర్వ హించారు. బీవీ రెడ్డి కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హాజరయ్యారు. కాలుష్యాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలతో దీపావళి పండుగను సంతోషంగా నిర్వహించు కోవాలన్నారు. అనంతరం పీవీకేఎన్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్ మొక్కలు నాటారు. అనంతరం చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణి కులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువగా ప్రజా రవాణా వ్యవస్థలను వినియో గించాలని, కాలుష్య కారకాలైన ప్లాస్టిక్ ను వినియోగించ వద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2వ డిపో మేనేజర్ రూపశ్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కళాశాల అధ్యా పకులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సిపిసి ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర' ను శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణలో, దత్తత గ్రామాలలో 'పరిశుభ్రమైన గాలి' ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం 50 మొక్కలు కళాశాల ప్రాంగణంలో నాటారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, అన్ని విభాగాల సిబ్బంది, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న నగర మేయర్ అముద

ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. దేవస్థానం అతిథి గృహంలో ఈవో పెంచల కిషోర్ , దేవస్థానం సిబ్బందితో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీగా బయలుదేరి ఆలయ మాడ వీధులలో ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓలు ధనంజయ, ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, సిఏఓ నాగేశ్వర రావు, సూపరింటెంట్లు కోదండపాణి, బాల రంగస్వామి దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో

ఉత్తమ క్యారెక్టర్ అవార్డును సొంతం చేసుకున్న ఏకాంబరం

చిన్నారికి ఆశీర్వాదం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : పాన్ ఇండియా మూవీ కాంతార సినిమాలో ఎస్ఆర్ పురం మండలం వెంకటాపురం పంచాయతీ పొదలపల్లి గ్రామానికి చెందిన ఏకాంబరం ఉత్తమ క్యారెక్టర్ విలన్‌గా అవార్డు అందుకున్నారు. దీంతో ఏకాంబరం తమ స్వగ్రామంలో గంగాధర నెల్లూరు వైసిపి ఇన్‌ఛార్జి కృపా లక్ష్మి చేతులు మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ సినిమా రంగంలో ఉత్తమ ప్రతిభ చూపి మరిన్ని అవార్డులను సొంతం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులు సైతం ఏకాంబరం నటనను ప్రశంసించారు. ఏకాంబరం మనవుడు జస్వంత్ జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారి తేజస్‌ను ఆశీర్వదించి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, మండల కన్వీనర్ మనీ, ఎంపీపీ సరిత జనార్ధన్, స్థానిక సర్పంచ్ విజయ, నాయకులు కాలప్ప, మహేష్,సుధాకర్, జయ, రఘు, రామకృష్ణ హాజరయ్యారు.

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం
కాణిపాకం గ్రామం, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా

ఇ-ప్రొక్యూర్మెంటు మరియు సీల్డు టెండర్ల ప్రకటన
ఆర్.సి.నెం.ఎ.డి./4210/2025, తేది: 15-10-2025

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానము, కాణిపాకం అన్నప్రసాద విభాగమునకు అవసరమైన తాజా కూరగాయలు 1 సం॥రము కాలమునకు అనగా ది:01-12-2025 నుండి 30-11-2026 వరకు సరఫరా కొరకు ఇ-ప్రొక్యూర్మెంట్ మరియు సీల్డు టెండర్ ద్వారా టెండర్లను ఆహ్వానించడమైనది. ఇ.యం.డి రూ. 1,00,000/-లు (అక్షరాల ఒక లక్ష రూపాయలు మాత్రమే). వివరముల కొరకు http://www.tender. apeprocurement.gov.ine apendowments marketing నందు చూడగలరు. మిగిలిన వివరముల కొరకు ఫోన్ నెం. 9440359849, 7382446489,9381418629 ద్వారా తెలుసుకొనగలరు.

కార్యనిర్వహణాధికారి
మరియు ప్రత్యేక శ్రేణి ఉప కలెక్టర్